ప్రజాశక్తి
గురువారం 19 అక్టోబర్ 2023
5
అల్లూరి సీతారామరాజు

ఇసుక వాహనాలు అడ్డగింత

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని తీగలవలస పంచాయితీ కామయ్యపేట పరిధిలో ఇసుకను అక్రమంగా లారీలతో తరలిస్తుండటంతో స్థానికులకు ఇల్లుల నిర్మాణానికి ఇసుక లేని పరిస్థితి ఏర్పడిందని సర్పంచ్, ఎంపిటీసీ పాంగి భేసు, కొర్ర నాగరాజు అన్నారు. బుధవారం గ్రామ వార్డు మెంబర్లు పంచాయతీ ప్రజలతో కలిసి వాహనాలను నిలిపివేసి సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరంసర్పంచ్, ఎంపిటీసీ మాట్లాడుతూ, పంచాయతీ ప్రజల అనుమతి లేకుండా బయట వ్యక్తులు లారీలతో అక్రమంగా తరలిస్తున్నారని, అధికారులకు ఫిర్యాదు చేస్తామని వారు హెచ్చరించారు. ఇకపై నుండి రవాణా జరిగితే ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కోటి బాబు, పంచాయితీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వాహనాలను అడ్డగించిన గ్రామస్తులు

గుర్రాలు, డోలీలతో పాదయాత్ర చేస్తున్న గిరిజనులు

గిరి గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని

డోలీలు, గుర్రాలతో సిపిఎం పాదయాత్ర

ప్రజాశక్తి-అనంతగిరి: పివిటీజీ మారుమూల గ్రామాలైన బల్లగరువు, దాయెర్తి, మద్రెబు వరకు రోడ్డు నిర్మించాలని సిపిఎం ఆధ్వర్యాన బుధవారం గుర్రాలు, .డోలీలతో సుమారు 5 కిలోమీటర్ల మేర పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభుడు కె.గోవిందరావు, మండల పీవిటి ఆదివాసి గిరిజన సంఘం నాయకుడు సుదాకర్ మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడుస్తున్నా పీవిటిజీ గ్రామాలకు రోడ్లు నిర్మించిన దాఖలాలు లేవన్నారు. పిన్నకోట, కివర్ల, జీనబాడు పంచాయతీ పరిధి సరిహద్దు గ్రామలైన కరకవలస, . రాచకిలం, పీచుమామిడి, కోటగరువు, గుమ్మం, మద్రెబు గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేక ఆయా గ్రామాల గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.మండల కేంద్రానికి 120 కిలోమీటర్ల దూరంలో ఉన్న పినకోట, పెద్దకోట, జీనపాడు పంచాయతీల పరిధిలో కొండ శిఖరం ఉన్న మద్రేవు, తునిసీబు,. దాయర్తి, గుమ్మంతి, 6.పీచు మామిడి, కరకవలస, రాచకలం, రెడ్డిపాడు, కోటగరవు గ్రామాలల్లో సుమారు 2000 మంది పివిటిజీ తెగలకు చెందిన ఆదివాసి గిరిజనులు నివసిస్తున్నారని తెలిపారు. గర్భిణిలు, ఇతర వ్యాధులతో బాదపడుతున్న గిరిజనులు వైద్యం కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి డోలీమోతలు, గుర్రాలతో వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గత సంవత్సరం ఆరుగురు గిరిజన రోగులను డోలీలో మోసుకుంటూ రోడ్డు మార్గానికి వెళుతుండగా సకాలంలో సరైన వైద్యం అందక ఐదుగురు మరణించినారన్నారు. రోడ్డు మార్గం లేకపోవడంతో రేషన్ బియ్యం తీసుకోవాలంటే 30 కిలోమీటర్లు నడవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గ్రామ సచివాలయం, బ్యాంకులకు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారన్నారు.జగనన్న ఇల్లు కట్టుకోవాలంటే గుర్రాలతో మెటీరియల్‌ను గిరిజనులే మోసుకొవాల్చిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు.జల్ జీవన్ మిషన్ ద్వారా మంచినీటి పథకాన్ని నిర్మాంచాలంట్లే దూరంలో ఇసుకన, సిమెంట్, ఇతర సామగ్రిని గుర్రాలపై మోసుకెళ్లి తెచ్చుకోవాల్సిన గతి ఏర్పడు తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిమవాసీ గిరిజనులు గేమ్మెల. జన్మరాజు, కొర్రా సుబ్బారావు, కొర్రా జమ్ములు, ఆదివాసి మహిళలు పాల్గొన్నారు.

సివిల్స్ ఉచిత శిక్షణకు

మొదటి దశలో 529 మంది ఎంపిక

-22న రెండవ దశ పరీక్ష
-27, 28 తేదీలలో తుది దశలో మౌఖిక పరీక్ష
- ప్రాజెక్ట్ అధికారి వి అభిషేక్

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు ఐటీడీఏ పరిధిలో ప్రాజెక్ట్ లక్ష్య పేరుతో గిరిజన విద్యార్థులకు సివిల్ సర్వీసెస్ పరీక్షకు ఉచిత శిక్షణ ఇవ్వడానికి నిర్ణయించామని, అందులో భాగంగా మొదటి దశ స్క్రీనింగ్ పరీక్షకు 1844 మంది దరఖాస్తు చేసుకుని 1750 మంది హాజరయ్యారని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ తెలిపారు. బుధవారం తన చాంబర్లో పాత్రికేయులతో మాట్లాడుతూ, మొదటి దశలో 529 మందిని ఎంపిక చేయడం జరిగిందని, వీరికి రెండవ దశ పరీక్ష ఈనెల 22వ తేదీన నిర్వహిస్తామన్నారు. ఈ పరీక్షలో నెగిటివ్ మార్కులు ఉంటాయని పిఒ వివరించారు. మొదటి దశలో 40 శాతం కట్ ఆఫ్ మార్కులుగా గుర్తించడం జరిగిందన్నారు. అందులో అత్యధిక మార్కులు 87 కాగా, 80 మార్కుల పైబడిన వారు ఇద్దరూ 75 మార్కులు పై పడినవారు ఐదుగురు ఉన్నారని తెలిపారు. ఉత్తీర్ణులైన అభ్యర్థుల వివరాలు ఐటీడీఏ కార్యాలయం నోటీసు బోర్డులో ప్రకటించడం జరిగిందని, అదేవిధంగా వారందరికీ సమాచారం అందించడం జరిగిందని పీవో తెలిపారు. రెండవ దశ స్క్రీనింగ్ పరీక్షకు హాజరయ్యే 529 మందికి పాడేరు కేంద్రంలో పరీక్షలు నిర్వహిస్తామని, 20వ తేదీ నుండి హాల్ టికెట్లు జారీ చేస్తామని పిఒ తెలిపారు. రెండవ దశ స్క్రీనింగ్ పరీక్షా ఫలితాలు 24వ తేదీన వెల్లడిస్తామని, ఎంపికైన వారికి 27, 28 తేదీల్లో మౌఖిక పరీక్ష నిర్వహించి అందులో ఎంపికైన వారికి నవంబర్ ఒకటవ తేదీ నుండి వేపగుంట లో ఉన్న యూత్ ట్రైనింగ్ సెంటర్లో ఉచిత శిక్షణ అందిస్తామని ప్రాజెక్ట్ అధికారి వివరించారు.

ఐటిడిఎ పిఒకు వినతి పత్రం అందిస్తున్న సర్పంచ్ వెంకమ్మ, సిపిఎం నాయకులు

కూటూరు సమస్యలపై ఐటిడిఎ పిఒకు వినతి

ప్రజాశక్తి-కూనవరం

మండలంలోని కూటూరు గ్రామ పంచాయతీ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరేకు సిపిఎం నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ గ్రామ సర్పంచ్ బొగ్గా వెంకమ్మ మాట్లాడుతూ, కూటూరు గ్రామంలో సిమెంట్ రోడ్లకు నిధులు మంజూరు చేయాలని, మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. కూటూరు శబరి నదిపై లిఫ్ట్‌కు కొత్త మోటార్లు మంజూరు చేయాలని, గ్రామంలో రైతులకు విద్యుత్ కనెక్షన్లు రెండు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితులు వల్ల రైతులు ఇబ్బంది పడుతున్నారని, కావున ప్రభుత్వం స్పందించి రైతులకు విద్యుత్ కనెక్షన్లు, మోటార్లు, ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాయం సీతారామయ్య, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, రైతు సంఘం నాయకులు కర్నాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సిసి రోడ్డుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని రంగశీల పంచాయతీ బలోర్ద గ్రామంలో గడప గడప కు కేటాయించిన నిధులతో సీసీ రోడ్డుకు బుధవారం స్థానిక జడ్పీటీసీ రేగం మత్స్యలింగం శంకుస్థాపన చేపట్టారు. సిసి రోడ్డు లేక గ్రామ ప్రజలు వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నారని వారి సమస్యను గుర్తించి గడప గడపకు కేటాయించిన నిధులతో సిసి రోడ్లు మంజూరు చేయడం జరిగిందని ఆయన అన్నారు. సిసి రోడ్లు మంజూరు చేయడంతో గ్రామ ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ తాంగుల ముత్యాలమ్మ, వైస్సార్సీపీ నాయకులు తాంగుల మోహనదాస్ పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న జడ్పిటిసి

ఊడిపోయిన వెనుక టైర్లను అమర్చుతున్న సిబ్బంది

ఘాట్ రోడ్డులో తప్పిన ప్రమాదం

-బస్సు వెనుక చక్రాలు ఊడిన వైనం

- భయాందోళన చెందిన ప్రయాణికులు

ప్రజాశక్తి -సీలేరు

జికె.వీధి మండలం దారకొండ ఘాట్ రోడ్డులో బుధవారం నర్సీపట్నం -సీలేరు బస్ వెనుక చక్రాలు ఊడిపోయాయి. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నర్సీపట్నం డిపోకు చెందిన నర్సీపట్నం - సీలేరు బస్సు ప్రతిరోజు ఉదయం నర్సీపట్నం కాంప్లెక్స్ నుంచి 10.30 గంటలకు బయలుదేరి సాయంత్రం 3.30 గంటలకు సీలేరు చేరుకుంటుంది. ఎప్పటి లాగే ఈ బస్ బుధవారం నర్సీపట్నంలో బయలుదేరి వస్తుండగా దారకొండ ఘాట్ రోడ్డు దారాలమ్మ అమ్మవారి దిగువన డౌన్‌లో ఒక్కసారిగా బస్సు వెనుక చక్రాలు ఊడిపోయి బస్సు ఒకపక్క ఒరిగిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనతో కేకలు వేశారు. ఈ సమయంలో డ్రైవర్ చాకచక్యంగా వ్యవహించి బస్సును నిలుపుదల చేయడంతో పెను ప్రమాదం తప్పంది. లేకుంటే సమీపంలో ఉన్న లోయలోకి బస్సు పడి ఉండేది. ఎటువంటి ప్రమాదం లేకుండా బస్సు నిలవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. దసరా సెలవులు కావడంతో బస్సు నిండా కిక్కిరిసినట్లు ప్రయాణికులు, విద్యార్థులు ఉన్నారు. బస్సు నిలిచిపోవడంతో దారకొండ సమీప గ్రామాల ప్రయాణికులు కొంతమంది కాలినడకన వెళ్లిపోగా, మరి కొంతమందిని వారి కుటుంబ సభ్యులు ద్విచక్ర వాహనాల వచ్చి తీసుకెళ్లారు. దుప్పిలివాడ, సీలేరుకు చెందిన ప్రయాణికులు బస్సులోనే ఉండిపోయారు. సాయంత్రం 6 గంటలైనా ప్రత్యామ్నాయ బస్సు ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు ఆందోళన గురయ్యారు. బస్సు వెనక టైర్లు పూర్తిగా మరమ్మతులకు గురికావడంతో ఘాట్ రోడ్‌లోని ఈ బస్సు నిలిచిపోయింది. ఏజెన్సీ ప్రాంతంలో కాలం చెల్లిన డొక్కు బస్సులు నడుపుతూ ప్రయాణికులు ప్రాణాలతో ఆర్టీసీ అధికారులు చెలగాటమాడుతున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కండిషన్ ఉన్న బస్సులు ఘాట్ రోడ్డులో నడపాలని కోరుతున్నారు.

గంజాయి, నాటుసారాపై ప్రత్యేక నిఘా

జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని గంజాయి, నాటుసారాపై ప్రత్యేక నిఘ ఏర్పాటు చేసి రవాణాకు అడ్డుకట్టు వేయాలని జిల్లా ఎస్పి తుహిన్ సిన్హా తెలిపారు. మండలంలోని బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఆకస్మిక తనిఖీ చేపట్టారు. రికార్డులు, కేసు వివరాలు పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, సేవా భావంతో విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. గ్రామ ప్రజల ఫిర్యాదులపై పూర్వ పరాలు పరిశీలించి సమస్య పరిష్కారం చేయాలన్నారు. యువతి యువకులను చెడు వ్యసనాల నుంచి దూరం చేసేందుకు గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయాలన్నారు. గంజాయి, నాటు సారా రవాణా చట్టరీత్యా నేరమన్నారు. మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలన్నారు.అనంతరం కానిస్టేబుల్ మోహన్ దాస్, త్రినాథ్‌లకు క్యాష్ రివార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏ ఎస్పి రాజ్, సిఐ సుధాకర్, స్థానిక ఎస్ఐ సతీష్ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్‌పి

20న చింతపల్లిలో జగనన్నకు చెబుదాం

ప్రజాశకి-పాడేరు: చింతపల్లిలో ఈనెల 20న జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చింతపల్లి ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించే స్పందనకు జిల్లా అధికారులు విధిగా హాజరు కావాలని ఆదేశించారు. స్పందన కార్య క్రమం ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతుందని స్పష్టం చేశారు. స్పందన అనంతరం శాఖాధికారులు సంబంధిత క్షేత్ర స్థాయి సిబ్బందితో సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. చింతపల్లిలో స్పందన ఉన్నందున పాడేరులో స్పందన రద్దు చేయడం జరిగిందని, ప్రజలు గమనించి పాడేరులో స్పందనకు రావద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

నినాదాలు చేస్తున్న శానిటేషన్ కార్మికులు

బకాయి వేతనాలు చెల్లించాలని

శానిటేషన్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-పాడేరు: తమకు 4 నెలల బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి పారిశుధ్య కార్మికులు బుధవారం మధ్యాహ్నం ఆసుపత్రి ప్రాంగణంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎల్.సుందరరావు మాట్లాడుతూ,. అల్లూరి జిల్లా పరిధిలో పాడేరు జిల్లా ఆసుపత్రి, అరకు, చింతపల్లి ఏరియా ఆసుపత్రి, ముంచంగిపుట్టు ఆసుపత్రిలో పనిచేస్తున్న సుమారు 80 మంది పారిశుద్ధ్య కార్మికులకు 4 నెలలు జీతం బకాయి వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు, ఇచ్చే కొద్ది పాటి జీతానికి శానిటేషన్ కార్మికుల్ని ఆర్థిక ఇబ్బందులకు గురి చేయవద్దని, ఇప్పటికి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ పిల్లల చదువుకు పిజులు కట్టలేక పోతున్నారన్నారు. కుటుంబ పోషణ ఇబ్బందిగా ఉందని, ఒకపక్క నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని అన్నారు.అప్పులు తెచ్చిన వడ్డీలు కట్టలేక పోతు మానసికమైన ఆందోళనకు గురి అవుతున్నారని అన్నారు. జీతం చెల్లించకుంటే పనులు నిలిపివేస్తామని హెచ్చరించారు. అనంతరం తమ వేతన బకాయిలు చెల్లించాలని మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ హేమలతకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు ముత్యాలమ్మ, ఘటి, సుధారాణి, పుణ్యవతి, కానక లక్ష్మి, మాధవి, నగేష్, సింహాచలం, చిట్టిబాబు, సింహాద్రి, నాగ భూషణ్, గిరిజన సంఘం నాయ కులు బొజ్జన్న పాల్గొన్నారు.

రెవెన్యూ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

ఆదివాసీ గిరిజన సంఘం

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: నకిలీ ఎస్టీ భగత కుల ధ్రువీకరణ పత్రం జారీ చేసిన తహాశీల్దార్, రెవెన్యూ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం అల్లురి జిల్లా కార్యదర్శి పి.బాలదేవ్ డిమాండ్ చేశారు. .బుదవారం అరకువేలి ఆదివాసీ గిరిజన సంఘం భవనంలో స్థానిక విలేకరులతో ఆదివాసి గిరిజన సంఘం అల్లూరి ప్రధాన కార్యదర్శి బాలదేవ్ మాట్లాడారు. అరకువేలి మండలం పెదలబుడు మేజర్ పంచాయితీ కంటబౌంసుగూడ లో గిరిజనేతరుడైన పిట్టల ప్రసాద్‌కు ఎస్టీ భగత కుల ధ్రువీకరణ మండల తహాశీల్దార్ ఎలా జారీ చేశారని ప్రశ్నించారు.అధికారులు ముడుపులకు ఆశపడి నకిలీ ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు సృష్టిస్తున్నారని ఆయన విమర్శించారు. రోజు రోజుకు నకిలి ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు ఒక్కటొక్కటిగా బయటకొస్తున్నాయని, పూర్తి విచారణ జరపాలని పిర్యాదు చేసినప్పటికీ అధికారులు ఎందుకు స్పందచ లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో పిట్టల రాంబాబు అనే గిరిజనేతరుడు వ్యవహారంలో కూడా ఇలాగే వ్యవహరించారని, అతనిపై విచారణ ఏమి జరిగిందో ఇప్పటివరకు బహిర్గతం చేయలేదన్నారు.అదే ఇంటి పేరుతో పిట్టల ప్రసాద్ అనే గిరిజనేతరుడుకి ఎస్టీ భగత కుల దృవీకరణ పత్రం జారీ చేశారన్నారు.నకిలీ కుల ధ్రువీకరణ పత్రం జారీ చేసిన తహాశీల్దార్, రెవిన్యూ సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే భవిష్యత్‌లో గిరిజన ప్రజా సంఘాలతో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు జి.బుజ్జిబాబు, మండల నాయకులు సిహెచ్ గురుమూర్తి, కె జగన్నాథం, హరీ, కుమారీ, నానిబబు, గాసీ, అప్పలస్వామి పాల్గన్నారు.

మహిళా మావోయిస్టు, మిలీషియా సభ్యుల అరెస్టు

పేలుడు పదార్థాలు స్వాధీనం

ప్రజాశక్తి-ఎటపాక

స్టేట్ స్పెషల్ పోలీస్ పార్టీకి వచ్చిన ముందస్తు సమాచారం మేరకు పోలీసులు గొల్లగుప్ప శివారు అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహించి మావోయిస్టు పార్టీ సభ్యురాలు సోడి మంగిని, ముగ్గురు మిలీషియా సభ్యులను అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఎటపాక పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రంపచోడవరం ఒఎస్‌డి కెవి.మహేశ్వరరెడ్డి వివరాలు వెల్లడించారు. ఒఎస్‌డి తెలిపిన వివరాలు ప్రకారం... పోలీసు పార్టీపై మందు పాతర పేల్చి హతమార్చాలని పథకం అమలు భాగంగా మావోయిస్టు పార్టీ నాయకులు, సభ్యులు, మిలీషియా సభ్యులు ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు గొల్లగుప్ప శివారులో కూంబింగ్ నిర్వహిస్తుండగా, మావోయిస్టు పార్టీ సభ్యురాలు సోడి మంగి, ముగ్గురు మిలీషియా సభ్యులు పట్టుబడ్డారు. మరి కొంత మంది తప్పించుకున్నారు. పట్టుబడ్డ వారి వద్ద నుండి 2 డిటోనేటర్లు, 1 మీటర్ కార్డెక్ష్ వైర్, ఒక బాటరీ, ఐరన్ ముక్కలు, ఎలక్ట్రికల్ వైర్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన సోడి మంగి (25)ది ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం సుకుమా జిల్లా, అర్లంపల్లి గ్రామం కాగా, మిలీషియా సభ్యులు మడకం లింగ (24)ది అదే జిల్లా బంగారు చెలక గ్రామం, మడకం రామయ్య (50), కురుసం భీమయ్య (25)లది అదే జిల్లా మైత గ్రామం. సోడి మంగి 2018లో మావోయిస్టు పార్టీ సభ్యురాలిగా చేరారు. ఆమె చింతూరు సబ్ డివిజన్ పరిధిలోనూ, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం పరిధిలోనూ 25 నేరాల్లో ముద్దాయి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఎటపాక మండలం చెరువు గుంపు గ్రామానికి చెందిన మడివి రాజ్ కుమార్‌ను కిడ్నాప్ చేసి ఛత్తీస్‌ఘడ్ మైత వద్ద చంపిన ఘటనలో, చింతూరు మండలం సరివెల వద్ద ట్రావెల్స్ బస్సు దహనం ఘటనలో, బురకన కోట గ్రామంలో సోయం సుబ్బయ్యను పోలీస్ ఇన్‌ఫార్మర్ నెపంతో చంపిన ఘటనలో పట్టుబడిన నలుగురు పాల్గొన్నారు. జీరగూడలో పోలీసులపై మావోయిస్టులు జరిపిన అంబుష్ దాడిలో 22 మంది సిఆర్‌పిఎఫ్ కమాండోలు మరణించిన ఘటనలో సోడి మంగి పాల్గొన్నట్లు ఒఎస్‌డి మహేశ్వరరెడ్డి వెల్లడించారు. నిషేధిత మావోయిస్టు పార్టీకి ఎవరైనా సహకరించినా, సంఘ విద్రోహక చర్యలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మావోయిస్టుల సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని మహేశ్వరరెడ్డి కోరారు. ఈ సమావేశంలో సిఆర్‌పిఎఫ్ 141 బెటాలియన్ సెకెండ్ ఇన్ కమాండెంట్ కమల్ వీర్ యాదవ్, అసిస్టెంట్ కమాండెంట్ హేమంత్ కుమార్ శర్మ, ఎటపాక సిఐ గజేంద్ర కుమార్, ఎస్సై కె పార్ధ సారధి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న ఒఎస్‌డి మహేశ్వరరెడ్డి, వెనుక భాగంలో అరెస్టయిన మావోయిస్టు, మిలీషియా సభ్యులు

వైసిపి ప్రభుత్వంలో సంక్షేమ ఫలాలు

ప్రజాశక్తి-రంపచోడవరం

ఇంతకుముందు ఎన్నడూ చూడని సంక్షేమ ఫలాలను వైసిపి ప్రభుత్వంలో ప్రతి గిరిజనుడూ చూడగలుగుతున్నాడనిఎమ్మెల్సీ అనంత బాబు, రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని బీవీ కోట గ్రామ సచివాలయం, భీరంపల్లి పంచాయతీ పరిధిలోని ఉసిరిజొన్నలు, గొట్లగూడెం, చిన్నబీరంపల్లి, పెదబీరంపల్లి గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే గడపగడపకు తిరుగుతూ ఈ నాలుగు సంవత్సరం కాలంలో ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమ పథకాలను వివరించే ప్రయత్నం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి, జెడ్పిటిసి, వైస్ ఎంపీపీలు, ఎంపిటీసీలు, సర్పంచులు, కోఆప్షన్ నెంబరు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రజల వినతి పత్రాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్సీ అనంత బాబు, ఎమ్మెల్యే ధనలక్ష్మి

కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న జనసేన నాయకులు

జనసేన కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అడ్డతీగల

అడ్డతీగల మండలం రాయపల్లి గ్రామంలో మూడు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన జనసేన కార్యకర్త సరుబోలు చిన్నయమ్మ కుటుంబాన్ని ఆ పార్టీ మండల నాయకులు బుధవారం కలిసి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారి కుటుంబానికి రూ.3000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల నాయకులు కుప్పాల జయరాం, పొడుగు సాయి, చిన్నారెడ్డి, సురేష్ రెడ్డి, అప్పాజీ, బాబీ తదితరులు పాల్గొన్నారు.

నారా భువనేశ్వరికి సంఘీభావం తెలుపుతున్న వంతల రాజేశ్వరి తదితరులు

నారా భువనేశ్వరిని కలిసిన మాజీ ఎమ్మెల్యే వంతల

ప్రజాశక్తి-రంపచోడవరం

తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరిని రాజమహేంద్రవరంలో టిడిపి రంపచోడవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి బుధవారం కలిశారు. చంద్రబాబు అరెస్టయి రాజమహేంద్రవరం జైలులో ఉన్న నేపథ్యంలో భువనేశ్వరిని కలిసి మీకోసం మేమున్నామంటూ సంఘీభావం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి సూర్యనారాయణ రాజు, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు వల్లభనేని చందు, రంపచోడవరం మండల అధ్యక్షులు కారం సురేష్ బాబు, రంపచోడవరం మాజీ సర్పంచ్ వై నిరంజన్ దేవి, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలు పరిశీలన

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం గాలికొండ, గుమ్మరేవులు, సీలేరు, దారకొండ పంచాయతీల పరిధిలో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ల భవనాల నిర్మాణాలను ఎంపిడిఓ ఉమామహేశ్వరరావు బుధవారం పరిశీలించారు. సంబంధిత కాంట్రాక్టులతో పనులు వేగవంతం చేయాలని గ్రామపంచాయతీ కార్యదర్శులను ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనులు ఏ దశలో ఉన్నాయో ఫోటోలు తీసి అప్లోడ్ చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో ఈ మేరకు ఫోటోలు తీసి కమిషనర్‌కు అప్లోడ్ చేయడం జరిగిందనివెల్లడించారు.

బోరు పనులను ప్రారంభిస్తున్న నేతలు

తాగునీటి బోరు పనుల ప్రారంభం

ప్రజాశక్తి-చింతపల్లి: మండలంలోని గొందిపాకల పంచాయతీలో రహదారి, తాగునీరు వంటి సమస్యలను అరకు పార్లమెంట్ సభ్యురాలు గొడ్డేటి మాధవి నిధులతో పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఆ పంచాయతీ ఎంపీటీసీ సభ్యుడు తాంబేలి మోహన్ రావు అన్నారు. మండలంలోని గొందిపాకల పంచాయతీ రోలుగుంట గ్రామంలో పెద బరద ఎంపీటీసీ సభ్యుడు పొట్టిక లోవరాజుతో కలిసి తాగునీటి బోర్ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మోహన్ రావు మాట్లాడుతూ, సమస్యలను ఆయన మాధవి దృష్టికి తీసుకెళ్లగా, సానుకూలంగా స్పందించిన ఆమె పంచాయతీ పరిధిలో 10 లక్షలతో సిసి రోడ్డు, సమగిరి, తాపాలెం, రోలుగుంట, గొడుగు మామిడి గ్రామాలకు తాగునీటి బోరులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా సచివాలయం కన్వీనర్ పోటుకూరి వెన్నెస్వామి, మాజీ రాజుబాబు, వార్డ్ సభ్యుడు సోమరాజు, వైసిపి నాయకులు బొబ్బిలి చిన్న, గుపాసారథి ఈశ్వర్‌రావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గిడ్డి ఈశ్వరి

చంద్రబాబు అరెస్టు కక్షపూరితం

- టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి

ప్రజాశక్తి-చింతపల్లి: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుపై వైకాపా ప్రభుత్వం కక్షపూరిత ధోరణితో అరెస్టు చేయించిందని తెదేపా పాడేరు నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ శాసనసభ్యురాలు గిడ్డి ఈశ్వరి విమర్శించారు. మండలంలోని మారుమూల పంచాయతీ అంజలి శనివారం పంచాయతీ బూలజకోట గ్రామంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో బాబుతో నేను అనే రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ, ఎంతోమందికి రాజకీయ భిక్ష పెట్టిన పార్టీ తెలుగుదేశం అన్నారు. ఎన్టీ రామారావు రెండు రూపాయలకే కిలో బియ్యం పథకాన్ని తీసుకువచ్చిన ఘనత తెదేపాదన్నారు. రాబోవు ఎన్నికలలో వైకాపాకు ప్రజలు రాజకీయ సమాధి కట్టడం ఖాయమన్నారు. పంచాయతీలోని సుమారు వందమంది తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పాల్గొన్నారు.

బొర్రాలో రోప్ వే ప్రారంభం వాయిదా

ప్రజాశక్తి-అనంతగిరి: ప్రముఖ పర్యాటక కేంద్రమైనటువంటి బొర్రా గుహ ముఖద్వారం వరకూ రోప్ వే ప్రారంభం వాయిదా పడింది. ఈనెల 19న గురువారం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా లాంఛనంగా ప్రారంభించవలసి ఉంది. అనివార్య కారణంగా వాయిదా పడినట్లు స్థానిక మండల పరిషత్ అధికారి హర్షిత్ పేర్కొన్నారు

1/ 70 చట్టానికి తూట్లు

-అక్రమంగా కట్టడాలు
-పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండల కేంద్రంలో 1/70 చట్టానికి తూట్లు పొడుతూ ఓ గిరిజనేతరుడు అక్రమంటా కట్టడాన్ని చేపడుతున్నాడు. మండల కేంద్రంలో గిరిజనేతరుడైన వైశ్యరాజు మధుసూదన్ రావు పీసాఆ చట్టాన్ని అతిక్రమించి ప్రభుత్వ భూములను దర్జాగా కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నాడు.గిరిజన ప్రాంతంలో బతుకుతెరువు కొరకు వచ్చిన గిరిజనేతరుడైన మధుసూదన్‌రావు కు వ్యాపారం నిర్వహించేందుకు సొంత దుకాణంతో కూడిన గృహం ఉన్నప్పటికీ అత్యాశతో 1/70 చట్టాన్ని ఉల్లంఘించి ఎంపీడీవో క్వార్టర్స్ కు సంబంధించిన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి గృహన్ని క్రమేపి విస్తరణ చేసుకుంటూ ప్రభుత్వ భూములను దర్జాగా కబ్జా చేస్తున్నాడు. రెవిన్యూ శాఖ అధికారులు గిరిజనేతరుడి వద్ద నుండి ముడుపులు పుచ్చుకున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. గిరిజనుల హక్కుల, చట్టాలను అమలు చేయవలసిన ప్రభుత్వ అధికారులే గిరిజనేతరులకు కొమ్ముకాస్తున్నారని గిరిజనులు ఆరోపించారు.దుకాణ నిర్మాణాలు, గృహనిర్మాణాలు, బహుళ అంతస్తులు, తాత్కాలిక, శాశ్వత గృహలు గిరిజనేతరులు అక్రమంగా

అక్రమంగా నిర్మిస్తున్న కట్టడం

చేపడుతుంటే చట్టపరమైన చర్యలు తీసుకోలేదని పలువురు గిరిజనులు ఆరోపించారు. ఇప్పటికైనా గిరిజనేతరుడు అక్రమ కట్టడాల పై అధికారులు స్పందించి నిలుపుదల చేయాలని కోరారు.

అక్రమ కట్టడాలపై స్థానిక విఆర్వో రమేష్‌ను వివరణ కోరగా.. అధికారులు చెప్పినప్పటికీ, ధిక్కరించి గిరిజనేతరుడు అక్రమ కట్టడాలను చేపడుతున్నాడని తెలిపారు.

గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు

కలెక్టర్ సుమిత్ కుమార్

జగనన్న సురక్షను ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్య ఫాల్గుణ

ప్రజాశక్తి -హుకుంపేట: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు ప్రభుత్వం అందిస్తుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు.మండలంలోని పాతుకోట గ్రామ సచివాలయం కేంద్రంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, అరుకు ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వైద్య శిబిరానికి వచ్చిన వారితో సేవ భావంతో మెలగాలన్నారు. ఆయ గ్రామాల్లో నుంచి వచ్చిన ప్రజలకు విశ్రాంతి కోసం అనుకూల ప్రదేశాలు ఏర్పాటు చేయాలన్నారు. పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులను సూచించారు. ప్రభుత్వం ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రస్తుతం జీవనశైలి మార్పులతో దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు ప్రత్యేక దృష్టి సారించి తగు చర్యలు తీసుకుంటుందన్నారు. అరకు ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ మాట్లాడుతూ, వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఆరోగ్యశ్రీ, సీఎం వైఎస్ జగన్ నాయకత్వంలో 'ఆరోగ్య సురక్ష' కార్యక్రమాలు చిరస్థాయిగా నిలిచి పోతాయన్నారు. ముందుగానే వ్యాధులను గుర్తించి సరైన వైద్య సహాయం అందిస్తే ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ సిహెచ్ బాలమణి దేవి, తహసిల్దార్ రాజ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి సుధీర్, అరుకు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ వైసీపీ పార్టీ సీనియర్ నాయకుడు సివెరీ కొండలరావు, పంచాయతీ సర్పంచ్ , ఎంపీటీసీ.బి పాటి లక్ష్మి, సాంబయి కొండమ్మ, నాయకులు సాంబయి కామరాజు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగ పరుచుకోవాలని స్థానిక ఎమ్మెల్యే ఫాల్గుణ కోరారు.. మండలంలోని కించుమండ ఆశ్రమ పాఠశాలలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిరుపేదలైన ప్రతి ఒక్కరికి మంచి వైద్యం అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ జడ్పిటిసిలు బి.ఈశ్వరి, సిహెచ్ జానకమ్మ, స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ, వైద్యాధికారులు విజయ్ కుమార్, ప్రేమ, పి.రాంబాబు, హెల్త్ అసిస్టెంట్ సంజీవ్, వైసిపి సీనియర్ నాయకులు ఎం శ్రీరాములు, సింహాచలం పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో 50 మంది గిరిజన విద్యార్థిని విద్యార్థులకు సివిల్ సర్వీసు పరీక్షలకు వేపగుంట యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ఉచిత కోచింగ్ సెంటర్ నిర్వహించనున్న విషయం విదితమే. 9 నెలల పాటు 50 మంది విద్యార్థిని విద్యార్థులకు, అధ్యాపకులకు సూచించిన మెనూ ప్రకారం రోజు వారి ఆహారం శిక్షణా కేంద్రంలోనే తయారు చేసి అప్పటికప్పుడి విద్యార్థులకు అందించుటకు ఆసక్తిగల అభ్యర్థులు, సంస్థల దరఖాస్తులను ఈనెల 19 గురువారం సాయంత్రం వరకు అందజేయవచ్చని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిపాదిత మెనూ ప్రకారం ప్రతి ఒకొక్కరికి రోజుకు రూ. 200 మించకుండా ప్రతిరోజు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనం సరఫరా చేయవలసి ఉంటుంది. వేపగుంట యూత్ ట్రైనింగ్ సెంటర్ ప్రాగణం వంటశాలలో మాత్రమే ఆహార పదార్థాలు తయారు చేసి అప్పటికప్పుడు అందిచవలసి ఉంటుందన్నారు.

సంతలో విక్రయిస్తున్న మేకలు

వారపు సంతలు కిటకిట

ప్రజాశక్తి -అనంతగిరి: దసరా కావ్వడంతో బుధవారం జరిగిన కాశీపట్నం, డముకు వారపు సంతలు ప్రజలతో కిటకిటలాడాయి. వారపు సంతలో కోళ్లు, మేకలు, పశువుల విక్రయాలు అధికంగా సాగాయి. దీంతో సంతలో సందడిగా నెలకొంది. సంతలో కోళ్లు, మేకలకు గిరాకీ లభించింది. కోడి దర రూ.1500 నుండి 2000, మేక ధర రూ.10 వేలు నుండి 15 వేలు పైగా లభించింది.

డిసెంబర్ 12 నుంచి ఎక్సాన్ సదస్సు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ (సిఐఐ) ఆధ్వర్యాన డిసెంబర్ 12 నుంచి 16వ తేదీ వరకు బెంగళూరులో ఎక్సాన్ -2023 ప్రత్యేక సదస్సు నిర్వహించనున్నట్లు దూసన్ బొబ్కాట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంట్రీ హెడ్ ఎస్.మంజునాథ్ తెలిపారు. విజన్ 2047 ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఎకానమీపై ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని నగరంలోని ఫోర్ పాయింట్స్ హోటల్‌లో బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా మంజునాథ్ మాట్లాడుతూ, ఎక్సాన్ ఎగ్జిబిషన్‌కు 15 దేశాల నుంచి సుమారు 80 సంస్థలు హాజరై తమ ఉత్పత్తులను, సాంకేతికతను ప్రదర్శించనున్నాయని తెలిపారు. ఆర్‌ఎస్ బిల్డర్స్ ఎగ్జిక్యూటివ్ పార్టనర్ ప్రదీప్ పాలడుగు అధ్యక్షతన ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఆంధ్రప్రదేశ్ మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎమ్‌డి యుజెఎం.రావు మాట్లాడుతూ, భారతదేశ ఆర్థిక వ్యవస్థలో భారతీయ రైల్వేలు ప్రధాన భూమిక పోషిస్తున్నాయని తెలిపారు. ప్రజలకు అతితక్కువ ఖర్చుతో అత్యాధునిక రవాణా సదుపాయాలు మెట్రో రైల్ అందిస్తోందన్నారు. తాము ఇప్పటికే 4 కారిడార్‌లలో 140 కిలోమీటర్లు మేర నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. మొదటి కారిడార్‌లో స్టీల్‌ప్లాంట్- కొమ్మది మధ్య 34 కిలోమీటర్లు 54 స్టేషన్లతో ఉంటుందని, 2వ కారిడార్ గురుద్వారా జంక్షన్ - పాత పోస్ట్‌ఆఫీస్ మధ్య 5.07 కిలోమీటర్లు 6 స్టేషన్లతోను, 3వ కారిడార్ తాటిచెట్లపాలెం నుంచి చినవాల్తేర్ మధ్య 6.75 కిలోమీటర్లు 7 స్టేషన్లతో, 4వ కారిడార్ కొమ్మాది- భోగాపురం ఎయిర్‌పోర్టు మధ్య 40.67 కిలోమీటర్లు 12 స్టేషన్లతో నిర్మించనున్నామని తెలిపారు. ఈ సమీక్షలో స్కైయింగ్ స్టెట్టర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఉపాధ్యక్షుడు ఇఎల్.కిరణ్‌బాబు, బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ కె.వెంకటేశ్వర్లు, సిఐఐ విశాఖపట్నం చైర్మన్ పిపి.లాల్‌కృష్ణ, పలువురు పారిశ్రామిక వేత్తలు, సిఐఐ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఐసిఇయు స్వర్ణోత్సవాలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ (ఐసిఇయు) విశాఖపట్నం డివిజన్ 50వ ఆవిర్భావ దినోత్సవం (స్వర్ణోత్సవాలను) ఎల్‌ఐసి డివిజనల్ ఆఫీస్ ఆవరణలో బుధవారం సభ్యుల సమక్షంలో వైభవంగా జరుపుకున్నారు. గత 5 దశాబ్దాల కాలంగా కార్మిక సంక్షేమానికి, సభ్యుల అభ్యున్నతికి కృషి చేసిన ఐసిఇయు 1974 అక్టోబర్ 18న మచిలీపట్నం డివిజన్ నుంచి విడివడి విశాఖపట్నం డివిజన్‌గా ఏర్పడిందని యూనియన్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు మల్లాది కామేశ్వరి, జి.వరప్రసాదరావు తెలిపారు. ఈ సందర్భంగా గతంలో పనిచేసిన నాయకుల సేవలను వారు గుర్తు చేశారు. గతంలో పనిచేసిన నాయకులు వేసిన బాటలోనే నేటి తరం దూసుకు పోతోందన్నారు. గత కాలం మాదిరిగా నేడు నియామకాలు లేవన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను విశ్లేషిస్తూ, ఇప్పుడు మనపై అధిక బాధ్యత పడిందన్నారు. మరింత అప్రమత్తంగా ఉంటూ, సంస్థ ఉన్నతికి పాటు పడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఎల్ఐసిలో ఐపిఓ వచ్చిన తర్వాత యూనియన్ బాధ్యత మరింత పెరిగిందని, హక్కులను కాపాడు కావాలంటే, మరింత మెరుగైన పనితీరు కనబర్చాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాబోయే సంవత్సర కాలం అనేక కార్యక్రమాలు జరుపుకోవాలని, సభ్యులంతా పాల్గొనేలా కార్యక్రమాలు ఉంటాయని తెలియజేస్తూ, స్వర్ణ జయంతోత్సవ లోగోను ఆవిష్కరించారు.

ఆకాశానికేసి వీధి దీపాల చూపులు

ప్రజాశక్తి- రంపచోడవరం :రాత్రి సమయంలో చీకటిలో భూమిపై జనజీవనం ఇబ్బంది పడకుండా, రాకపోకలకు అవస్థలు పడకుండా వీధి దీపాలను ఏర్పాటు చేస్తారు. కాని రంపచోడవరంలో అందుకు భిన్నంగా భూమిపైకి కాకుండా ఆకాశానికి వెలుగునిచ్చేలా వీధి దీపాలు ఏర్పాటు చేశారు. రంపచోడవరంలోని ఆబ్కారీ కార్యాలయం మార్గంలో ఉన్న విద్యుత్ వీధి దీపాలు నేలపైకి కాకుండా ఆకాశం వైపు తిరిగి ఉన్నాయి. దీంతో ఈ మార్గంలో విద్యుత్ వీధి దీపాలు ఉన్నా విద్యుత్ కాంతి లేక చీకటిమయంగా ఉంది. ఫలితంగా ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు, స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ సిబ్బంది ఈ వీధి దీపాలను సరిచేయాలని పలువురు కోరుతున్నారు. అధికారుల నిర్లక్ష్యంపై స్థానికులు మండిపడుతున్నారు.

పైకి తిరిగి ఉన్న వీధి దీపాలు

సురక్షిత ఆటలాడడం
పిల్లల ఆరోగ్యానికి శ్రేయస్కరం

డాక్టర్ పి సాధన. కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ సర్జన్, కిమ్స్ ఐకాన్

ప్రజాశక్తి -గాజువాక : చిన్నపిల్లల్లో శారీరక చురుకుదనం లేకుంటే, క్రమంగా ఎముకల వ్యాధులకు కారణమౌతుందని కిమ్స్ ఐకాన్ కన్సల్టెంట్ ఆర్థోపెడిక సర్జన్ డాక్టర్ పి.సాధన అన్నారు అదే సమయంలో పిల్లలు ఆటలాడేటప్పుడు తగు జాగ్రత్తలు, అప్రమత్తత అవసరమన్నారు.

డాక్టర్ సాధన

ప్రమాదాలు జరిగేటప్పుడు, ఆటలాడినపుపడు తగిలే గాయాల వల్ల పిల్లలలో మస్క్యులోస్కెలెటల్ డిజార్డర్స్ వచ్చే అవకాశం ఉందన్నారు. రుమటాయిడ్ ఆర్థరైటిస్, ఎముక పగుళ్లు, గ్రోత్ ప్లేట్ గాయాలు,టెండినిటిస్ హిప్ అభివృద్ధి డైస్ప్లాసియా కండరాల బలహీనత, బోలు ఎముకల వ్యాధి ఈ రుగ్మతలన్నీ పిలల్లో పనితీరును,వారి చలనశీలతను ప్రభావితం చేస్తాయన్నారు టివి, మొబైళ్లకు అతుక్కుపోతున్న నేటితరం పిల్లలు చలనం లేని జీవితాన్ని గడుపుతున్నారని, శారీరక చురుకుదనం లేకుంటే క్రమంగా ఎముకల వ్యాధులు వచ్చే ఛాన్స్ ఉందన్నారు. వాకింగ్, జాగింగ్, రన్నింగ్, మెట్లు ఎక్కడం వంటివి ఎముకలు బలోపేతానికి దోహదపడతాయని, వ్యాయామంతో ఎముకల కణాల్లో ఎదుగుదల ఉంటుందన్నారు. పిల్లలు ఎముకల సంబంధిత సమస్యలతో బాధపడుతుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ఎముకలు, కీళ్ల ఇన్ఫెక్షన్లు అనేవి నరాలు, కండరాలు, ఎముకలు, కీళ్లు, స్నాయువులను ప్రభావితం చేస్తాయన్నారు.

పిల్లల ఎముకలు, కీళ్ల ఆరోగ్యానికి చిట్కాలు

కాల్షియం, విటమిన్ డి, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్‌లు పుష్కలంగా లభించే సమతుల, పోషకాహారాన్ని పిల్లలు తినేలా చూడాలి. పాలు, ముదురు ఆకుకూరలు, కొవ్వు చేపలు తినడం, సూర్యరశ్మి చాలా మంచిదన్నారు. అధిక బరువు ఊబకాయం సమస్యలను నివారించడానికి లేదా తగ్గించడానికి క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. ఎముకలు ఆరోగ్యంగా,బలంగా ఉండటానికి ఏరోబిక్స్,కొన్ని బరువు మోసే వ్యాయామాలు ముఖ్యమైనవన్నారు.అధిక బరువుతో ఉన్న పిల్లలకు చిన్నగాయాలు కూడా దారుణంగా బాధిస్తాయన్నారు. తగినంత కాల్షియం, విటమిన్-డితో కూడిన ఆహారాన్ని తీసుకోవడం, సురక్షితంగా ఆటలాడడం పిల్లల ఆరోగ్యానికి శ్రేయస్కరమన్నారు.

పంట కాలువ పూడికతీత పనుల పరిశీలన

ప్రజాశక్తి-రంపచోడవరం :మండలంలోని భూపతిపాలెం పంట కాలువలో చేపట్టిన పూడిక తీత పనులను బుధవారం రంపచోడవరం ఎంపీపీ బంధం శ్రీదేవి పరిశీలించారు. ఈ కాలువ పూడికపోవడంపై సోమవారం ఐటిడిఎ స్పందనలో ప్రాజెక్టు అధికారికి ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఆయన ఆదేశాలు మేరకు భూపాతిపాలెం ప్రాజెక్టు ఇంజనీరింగు అధికారుల పర్యవేక్షణలో పనులు చేపట్టారు

. ఈ పనుల పరిశీలన సందర్భంగా ఎంపిపి రైతులతో మాట్లాడుతూ ఖరీఫ్ పంట పండిన తర్వాత రబీ పంటకు భూపతిపాలెం కాలువ నీరు కోసం ఎదురు చూడకుండా ఆరుతడి పంటలు వేసుకోవాలని, ఆ సమయంలో ఈ కాలువను ప్రాజెక్టు అధికారులకు అప్పగిస్తే పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయించే ఆలోచనలో ఎమ్మెల్సీ అనంతబాబు, ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఉన్నారని తెలిపారు. దీనికి ప్రాజెక్టు ఆయకట్టుదారులందరూ సహకరించాలని కోరారు. ఆమె వెంట మర్రివాడ, తాటివాడ సర్పంచ్ లు కారం రాజన్నదొరకుమారి,చోడి కాశీవెంకటలక్ష్మి, సచివాలయ కన్వీనర్ కలుం చిన్నాలుదొర తదితరులు ఉన్నారు.

కాలువ పూడికతీత పనులను పరిశీలిస్తున్న ఎంపిపి

'గెయిల్'కు 'గీతం' సాంకేతిక సహకారం

ప్రజాశక్తి- మధురవాడ : కేంద్రప్రభుత్వ మహరత్న కంపెనీలలో ఒకటైన గెయిల్, వివిధ ప్రాంతాలలో ఉపయోగిస్తున్న గ్యాస్ పైప్‌లైన్‌లకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసిన గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం, బుధవారం వాటిని అధికారికంగా గెయిల్ సంస్థకు బదలాయించింది. గెయిల్ విశాఖ-సికిందరాబాద్ ఎల్‌పిజి పైప్‌లైన్ ఛీఫ్ జనరల్ మేనేజర్ ఎల్.ఎస్.రావు పాల్గొని సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన అధికారిక పత్రాలను గీతం రీసెర్చి డైరక్టర్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు నుంచి స్వీకరించారు.

అధికారిక పత్రాలను అందజేస్తున్న గెయిల్ ప్రతినిధులు

ఈ సందర్భంగా ఎల్.ఎస్.రావు మాట్లాడుతూ తమకు ఎదురైన సాంకేతిక సమస్యకు గీతం టెక్నాలజీ ఆఫీసర్ డాక్టర్ చంద్రమౌళి అతితక్కువ సమయంలో పరిష్కారం చూపారని అభినందించారు. భవిష్యత్తులో మరికొన్ని ప్రాజెక్టులను గీతం వర్సిటీకి ఇవ్వడానికి ప్రయత్నిస్తామన్నారు. ఎల్‌పిజి. పైప్‌లైన్ పరిజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన కలిగించడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. గీతం రీసెర్చి డైరక్టర్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు మాట్లాడుతూ గీతం టెక్నాలజీ అనేబిలింగ్ సెంటర్ (జి-టెక్) ద్వారా రాష్ట్రంలోని విద్యాలయాలకు పరిశ్రమలకు మధ్య సంబంధాలను మెరుగు పరిచేందుకు కృషిచేస్తున్నామన్నారు. స్థానిక పరిశ్రమలు తమ సాంకేతిక సమస్యలను జిటెక్ దృష్టికి తెచ్చి, పరిష్కారం పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో గీతం టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ ఆఫీసర్ డాక్టర్ చంద్రమౌళి, గెయిల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ పి.రామకృష్ణ, మెకానికల్ విభాగం అధిపతి ప్రొఫెసర్ శ్రీనివాస్, జి-టెక్ డిప్యూటీ డైరక్టర్ సోంభట్ శాస్త్రి, ఫుడ్ సైన్స్ టెక్నాలజీ విభాగం అధిపతి డాక్టర్ కె.విశ్వనాధ్ చైతన్య పాల్గొన్నారు.

సెయిల్‌తో సమానంగా బోనస్ చెల్లించాలి

- వైఎస్ఆర్‌టియు ఆధ్వర్యాన ఉక్కు కార్మికుల ధర్నా

ప్రజాశక్తి -గాజువాక : సెయిల్‌తో సమానంగా విశాఖ ఉక్కు కార్మికులకు బోనస్ చెల్లించాలని స్టీల్ వైఎస్ఆర్‌టియు ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప డిమాండ్ చేశారు. బుధవారం ఉక్కు బిసి గేట్ వద్ద స్టీల్ వైఎస్ఆర్‌టియు ఆధ్వర్యంలో ధర్నా చేశారు, ఈ సందర్భంగా మస్తానప్ప మాట్లాడుతూ గత బోనస్ బకాయిలు రూ.9,500తో కలిపి సెయిల్‌తో సమానంగా విశాఖ ఉక్కు కార్మికులకు బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగసంస్థగానే కొనసాగించాలని, సొంత ఐరన్ గనులు కేటాయించాలని,. 2017 జనవరి ఒకటి నుంచి ఎన్‌జెసిఎస్ ప్రకారం బకాయిలతో కలిపి కొత్త వేతనాలు చెల్లించాలని, అన్ని విభాగాలల్లో కార్మికులను పెంచాలని డిమాండ్ చేశారు. స్టీల్ కాంట్రాక్టు కార్మికులకు బోనస్ చెల్లింపు, స్కిల్డ్ కాంట్రాక్టు కార్మికుల కుటుంబాలకు హెల్త్ కార్డులు, మిగిలిన 8500 ఆర్-కార్డు నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. ధర్నాలో మార్డుపూడి పరదేశి, పిట్టా రెడ్డి, కర్రి దాలినాయుడు, ఎన్నేటి రమణ, నక్క వెంకటరమణ, నల్లిమిల్లి శ్రీనివాసరెడ్డి, అండిబోయన అప్పారావు, బొడ్డుపల్లి రమేష్, శ్రీను పాల్గొన్నారు.

వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి -సీతమ్మధార : ఆరోగ్యానికి తగు జాగ్రత్తలతోపాటు ప్రతిఒక్కరూ వ్యాయామం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైసిపి సీనియర్ నేత బొడ్డేటి కాశీవిశ్వనాథం అన్నారు. బుధవారం పోర్టు స్టేడియంలో 'ట్రాన్స్‌సెండ్' జిమ్ సెంటర్‌ను ప్రారంభించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ, మనిషి ఆరోగ్యం, ఫిట్‌నెస్‌గా ఉండాలంటే వ్యాయామం అవసరమన్నారు. ఈ జిమ్‌సెంటర్‌లో ఆధునిక జిమ్ సామగ్రి అందుబాటులో ఉందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు విశ్వనాథం స్పోర్ట్స్ క్లబ్ ద్వారా పోర్టు స్టేడియంలో పిల్లలకు అన్ని రకాల గేమ్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. క్రీడలతో మంచి గుర్తింపు తెచ్చుకుని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి, భవిష్యత్‌ను బంగారుమయం చేసుకోవాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో 43వ వార్డు వైసిపి కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ, విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ ప్రతినిధులు బొడ్డేటి ప్రమోద్‌కుమార్, బొడ్డేటి నరేంద్ర, మురళి, ట్రైన్ స్టాండ్ ప్రతినిధులు పాల్గొన్నారు

రేషన్ సరుకుల పంపిణీలో నిర్లక్ష్యం

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరులో ప్రతి నెలా రేషన్ సరుకులు పంపిణీలో ఎండియు వాహనదారుడు పసుపులేటి యోగేంద్ర ప్రసాద్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎంపిటిసి సాంబమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రతినెలా ప్రజలకు సకాలంలో రేషన్ సరుకులు పంపిణీ చేయడం లేదన్నారు. నిబంధన ప్రకారం ఎండియు వాహనాల వద్ద నిత్యావసర సరుకుల స్టాక్ ధరల పట్టిక ప్రదర్శించడం లేదని పేర్కొన్నారు. సీలేరు జిసిసి డిపో పరిధిలో సుమారు 800కి పైగా తెల్ల రేషన్ కార్డులు కలిగిన లబ్ధిదారులు ఉన్నారని, ప్రతినెలా వారికి రేషన్ సరుకులు అందక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ విషయమే అనేకసార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన సక్రమంగా రేషన్ సరుకులు పంపిణీ కార్యక్రమాన్ని అమలు చేసే విధంగా అధికారులు చర్యలు చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్టోబర్ నెలలో సుమారు 200 పైగా కార్డులకు మాత్రమే బియ్యం పంపిణీ చేసినట్లు కార్డుదారులు తమ దృష్టికి తీసుకొచ్చారని పేర్కొన్నారు. మిగతా రేషన్ కార్డులకు పూర్తిస్థాయిలో ఇప్పటివరకు బియ్యం పంపిణీ జరగకపోవడానికి గల కారణాలు ఏమిటో తమకి అర్థం కావడం లేదని పేర్కొన్నారు. నిర్ణీత వ్యవధిలో రేషన్ సరుకులు వాహనాల ద్వారా ఇంటింటికి అందజేయకపోతే చర్యలు తప్పవని ఆహార కమిషనర్ చైర్మన్ విజయ్ ప్రతాప్ రెడ్డి హెచ్చరికలు జారీ చేసినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నిర్ణీత వ్యవధిలో రేషన్ సరుకులు అందేలా చర్యలు చేపట్టాలని ఎంపిటిసి సాంబమూర్తి కోరారు.

విలువలు పాటిస్తే యువతకు ఉజ్వల భవిత

గీతం ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న భక్తదాస

ప్రజాశక్తి- మధురవాడ : యువతరం విలువలు పాటిస్తూ ఉన్నతమైన వక్తిత్వంతో ఆదర్శంగా నిలవాలని తద్వారా ఉజ్వల భవిష్యత్తు సాధ్యపడుతుందని అక్షయ పాత్ర ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ ప్రభు నిష్కించిన భక్తదాస సూచించారు. బుధవారం గీతం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మాట్లాడుతూ, మనిషిలోని రాక్షస ప్రవృత్తి జీవితంలో ఎదగకుండా అడ్డు పడుతుందని, దాన్ని సంహరించి విజయం సాధించడమే విజయదశమి, దసరా పండుగ అంతరార్థం అన్నారు. చెడు మార్గాన్ని, దేశానికి సమాజానికి హని చేసే ప్రవృత్తులకు యువత దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు మాట్లాడుతూ మంచిని ప్రోత్సహించడం, విలువలు పాటించడం, సమాజ హితాన్ని కోరుకోవడం గురించి భారతీయ సంప్రదాయాలను చాటుతాయన్నారు. యువత ఏ రంగంలోకి ప్రవేశించినా, వృత్తి ధర్మాన్ని, విలువలను పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ఎ.శ్రీనివాస్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ షంషుద్దీన్ షేక్ పాల్గొన్నారు. వివిధ సేవా కార్యక్రమాలలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్‌లను అందజేశారు.

పంచకర్లకు అభినందన

ప్రజాశక్తి-సీతమ్మధార :ఉమ్మడి విశాఖ జిల్లా జనసేన అధ్యక్షులుగా నియమితులైన మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబును జివిఎంసి కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్, చోడవరం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి పివిఎస్ఎన్.రాజు, ఇతర నేతలు కలిసి, పుష్పగుచ్ఛాలను అందించి అభినందించారు. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేసిన సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న పంచకర్ల రమేష్‌బాబు నియామకాన్ని పార్టీ శ్రేణులు మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నాయని, వీరి అనుభవంతో పార్టీ మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో జనసేన సత్తా చూపి, విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.